



ది గ్రేట్
సత్యమూర్తి గారిని
స్మరించుకుంటూ...
హాస్యానందం

# సత్యమూర్తిగారి వర్ణ‘చిత్రాలు











సత్యమూర్తిగారి ముఖ'చిత్రాలు






స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

# హాస్యానందం

సంపూర్ణహాస్య మాస పత్రిక

జనవరి-2014 ✦ సంపుటి-10 ✦ సంచిక-9

*Publisher&Editor* : Ramu.P
*Chief Artist* : A.Dayakar
*Cartoon Editor* : A.V.M
*Full Pillar* : Bnim
*Abroad Promoter* : V. Pavan Kumar, USA
*Well Wishers* : Tanikella Bharani, Jaydev, Mallik, Sanku
*Designing* : Creative Graphix
*Creative Team* : Tumbali Sivaji, T.Chandra Sekhar, Rampa, P.V.Narayana, Ramsheshu, P.Priyatham, Mallikarjun.U

*Address* : HASYANANDAM,
#8-215/4,
Near Ramalayam,
Po:YERRABALEM
Pin 522 503,
Mangalagiri Mandal,
Guntur dist.
*Ph* : 9849630637

email: **hasyanandam @yahoo.com**

Hyderabad & Secunderabad Distributors:

**Charminar News Agencies,**
1-6-176/1, M.G.Road,
Khandoji Bazar, **Secunderabad-3.**
Ph:9346515813
J.N.Road, Abids, **Hyderabad.**
Ph:040-30720007



## హాయ్... సానందంగా...

**హా**స్యానందం అభిమానులకు... ఆప్తులకు... సన్నిహితులకు **ఆంగ్ల నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు!**

హాస్యానందం ప్రముఖులగురించి ప్రత్యేక సంచిక వెలువరుస్తున్న పరంపరలో ఈ సంచికని శ్రీసత్యమూర్తిగారి కార్టూన్ వైభవంగా తీర్చిదిద్దాము.

శ్రీసత్యమూర్తిగారి 75వ జన్మదిన సందర్భంగా హాస్యానందం ఈ ప్రత్యేక సంచికని ఆయనకు శుభాకాకాంక్షలతో అందిస్తోంది.

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ... కష్టనష్టాలని ఓర్చుకుంటూ...పడుతూ...లేస్తూ...'ప్రయాణం' సాగించిన శ్రీసత్యమూర్తిగారు ఈ రోజు యువ కార్టూనిస్టులకు, గ్రాఫిక్ డిజైనర్లకు ఓ 'జంక్షన్' అయ్యారు.

ఆయన జీవితం ఓ పెద్దబాలశిక్ష!... పెరల్సిస్ వచ్చి, బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ అయ్యాక డాక్టర్లు పెదవి విరిచేసినా... గొప్పదైన తమ సంకల్ప బలంతో కోలుకున్నారు. స్వాధీనంలోకి రాని చేతిని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఆయన పట్టుదల, పని పట్ల అంకితభావం ఎలాంటివో అర్థమవుతుంది.

చిన్నపిల్లాడిలా 'కాపీ' బుక్‌లతో అక్షరాలను ప్రాక్టిస్ చేసారు. తన స్టైల్ బొమ్మలు తయారయ్యే వరకు మొండిగా బొమ్మలు గీసారు. ఎన్నో ఏళ్ళు కష్టపడి తన చేతిని స్వాధీనంలోకి తెచ్చుకుని పట్టుదల, కృషికి మారుపేరుగా 'B' అంటే 'Brave'...'V' అంటే 'Victory' గా బి.వి.సత్యమూర్తిగారు సెకండ్ ఇన్నింగ్ ప్రారంభించారు.

ఆయన పర్‌ఫెక్షన్ కోసం ఎంత శ్రమిస్తారో- స్వయంగా చూసాను నేను. 1987లో గ్రాఫిక్ డిజైనింగ్ ట్రైనింగ్ కోసం నేను ఆయన దగ్గర జాయినయ్యాను. ఒక చిన్న లైన్ కూడా ఎంత షార్ప్‌గా ఉండాలో దగ్గరుండి నేర్పించారు. పని చేస్తున్నప్పుడు ఎవరైనా వచ్చి'బాగుంది' అంటే సీరియస్‌గా 'బాగుంది అంటే ఎదగడం ఆగిపోతుంది.' అనేవారు. ఈ రోజుకి నేను ఏపని చేస్తున్నా ఆ మాటలనే 'మంత్రం'గా మననం చేసుకుంటుంటాను. థ్యాంక్స్ సత్యమూర్తిగారూ!

ఈ సంచిక చూసి మీ అభిప్రాయాలను తెలియజేస్తారు కదూ?

అందరూ హాయిగా...ఆనందగా ఉండాలని కోరుకుంటూ...

**-రాము.పి** (ఎడిటర్)

# "పత్రికలు కార్టూనిస్ట్‌లకి తగిన ప్రోత్సాహం ఇస్తే ఇంకా బాగా రాణించగలరు." -సత్యమూర్తి

**అచ్చతెలుగు కార్టూనిస్ట్! ప్రశాంతమైన వదనం...ప్రశాంతంగా పనిచేసే తీరు... పర్‌ఫెక్ట్‌నెస్‌కోసం పడే తపన... చేసే పని కోసం కమిట్‌మెంట్... వెరసి మనందరికి ఇష్టమైన కార్టూనిస్ట్ శ్రీసత్యమూర్తిగారు! ఎంత గంభీరంగా ఉంటారో... తన దగ్గరకు వెళ్ళే వారిని అంతమృదువుగా ఆదరిస్తారు. ఆ వ్యకిత్వం నేటి యువతకు ఆదర్శం కావాలి... పనికోసం వెతుక్కోకుండా... పనినే సృష్టించుకుని కార్టూన్లను వ్యాపార ప్రకటనలో గుప్పించి కార్టూన్‌రంగంలో ఓ చరిత్ర సృష్టించి... ఓ కంపెనీని ప్రారంభించి దాన్ని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా ఎదిగించిన మన సత్యమూర్తిగారి మనోభవాలు ఒకసారి పరికిద్దాం!**



✦ **మీరు కార్టూనిస్ట్ కావడానికి ఇన్సిపిరేషన్?**

శ్రీబాపుగారే నాకు ఇన్‌స్పిరేషన్. నేను వారికి వీరాభిమానిని.

✦ **ఈ రంగంలో మీకు ప్రోత్సాహాన్నందించినవారు?**

మొట్టమొదట 1956లో రేడియో అన్నయ శ్రీన్యాయపతి రాఘవరావుగారు బాలపత్రికలో కార్టూన్స్, బొమ్మల కథలు, అట్టమీద బొమ్మలు వేయించేవారు. ఆంధ్రసచిత్ర వార పత్రికలో శ్రీశివలెంక రాధాకృష్ణగారు కార్టూన్, కథలకి బొమ్మలు, అట్టమీద బొమ్మలు 'చదువు(లావు' కార్టూన్స్ వేయించి చాలా ప్రోత్సాహించే వారు. ఆంధ్రప్రభ వీక్లీలో శ్రీపొత్తూరి వెంకటేశ్వరరావుగారు, యువ చక్రపాణిగారు, జ్యోతి రాఘవయ్యగారు, ఆంధ్రభూమిలో శ్రీపండితారాధ్యుల నాగేశ్వరరావుగారు, యం.వి.శాస్త్రిగారు వి.ఎస్.ఎన్.మూర్తిగారు, కనకాంబరాజుగారు, ఎ.ఎస్.లక్ష్మిగారు, రచనసాయిగారు, విజయబాబుగారు, వేటూరిసుందరరామ్మూర్తి గారు చాల ప్రోత్సాహించారు. ఇంకా మా అన్నయ్యలు శ్రీ బి.వి. రమణారావు, బి.వి.ఎస్.రామారావు(ప్రముఖ రచయితలు) చాలా ప్రోత్సాహాన్నందించారు.


✦ **మీ కార్టూన్‌లు ఓ ప్రత్యేకమైన శైలితో... చూడగానే సత్యమూర్తిగారి కార్టూన్ అని చెప్పేయొచ్చు... దీని వెనకాల మీ కృషి ఎలాంటిది?**

కృషే!

✦ **చాలామంది కార్టూనిస్ట్‌లు ఈ కళ గురించి ఎప్పుడో అప్పుడు నిరుత్సాహంగా మాట్లాడటం వింటూంటాం... మీరలా ఎప్పుడైనా ఫీలయ్యారా?**

1956 నుంచి అన్ని పత్రికలకు కార్టూన్స్ వేసేవాడిని. ఇది బాగుందిరా... దీన్నే కెరీర్ చేసుకోవచ్చని అనుకున్నాను. 67 ప్రాంతంలో నేనొక పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో మూడేళ్ళు పని




చేసాను. అక్కడ చాలా డర్టీ పాలిటిక్స్ ఉండేవి. ఇమడలేక పోయాను. పైగా అప్పట్లో పత్రికల్లో కొత్తకొత్త వాళ్ళు వచ్చి, వాళ్ళ శిష్యులకి అవకాశాలిచ్చారు. అది బాగానే ఉంది కానీ, నేను కెరీర్ చేసుకుంటే ఇప్పట్లో బతుకుతెరువుకి ఇది చాలా కష్టం అని మా కంపెనీలో నాకు పరిచయమైన 'గ్రాఫిక్ డిజైనింగ్' చేస్తూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి బ్లెసింగ్స్‌తో 'శ్రీసత్యసాయి డిజైనింగ్ స్టూడియోస్ ప్రారంభించి, ఇప్పుడు విజయవంతంగా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా చేయ గలిగినది అంటే అది భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారి అనుగ్రహం వలననే.

✦ **ప్రకటనరంగంలో కార్టూన్లతో ఓ కొత్తఒరవడిసృష్టించి ఎందరికో మార్గదర్శకమయిన మీరు ఆ ప్రక్రియకు నాంది పలకడానికి ఏమైనా కారణాలున్నాయా ?**

నాకు కార్టూన్లు వేసే అనుభవం ఉంది కనుక కమర్షియల్ వర్క్‌లో ఇన్‌ఫెన్‌టోన్ గ్రైప్ వాటర్‌కి, నాగార్జున సిమెంట్స్‌కి, విష్ణు సిమెంట్స్ మొదలైన కంపెనీలకి, పోలీస్ వెల్‌ఫేర్ ఫండ్ ప్రకటనలకి, కొన్ని సినిమాప్రకటనలకి బి.హెచ్.ఎల్, క్వాలిటీ మీద, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలుగు క్యాలెండర్లలో కార్టూన్లు వాడాను. ఫామిలీ ప్లానింగ్ కార్టూన్లు వేసాను.

✦ **ఇంకా మీరు ఈ కార్టూన్ కళతో ఎన్నెన్ని ప్రయోగాలు చేసారో కాస్త వివరిస్తారా?**

ప్రకటనలకే కాకుండా కొన్ని మెడికల్ కంపెనీల విజువల్ ఎయిడ్స్, క్యాచ్ కవర్, బ్రోచర్‌లోనూ, కొన్ని సీడ్ గ్రోయర్ కంపెనీలకు, వాల్ పోస్టర్లలోనూ, పాయింట్ ఆఫ్ పర్చేస్ డిజైన్‌లోనూ, డైరెక్ట్ మెయిలర్స్, గ్రీటింగ్ కార్డుల మీద కార్టూన్లు వేసాను. ఫ్యామిలీ వెల్‌ఫేర్ వారి గర్ల్ చైల్డ్ విద్య, ఆరోగ్యం, పెళ్ళి వయస్సుల మీద బొమ్మల కథలతో పుస్తకాలు చేసాను. బంగారునంది గెలుచుకున్న'సుడిగుండాలు చిత్రానికి 'ఆర్ట్ డైరెక్టర్'గా చేసాను.

✦ **మీ దగ్గర డిజైనింగ్‌గానీ, కార్టూన్లుగానీ నేర్చుకుని మిమ్మల్ని మెప్పించిన వారి పేర్లు చెప్తారా?**

గ్రాఫిక్ డిజైనింగ్‌లో రాముగారు, దుర్గాప్రసాద్, ప్రసాద్, షకీల్‌అహ్మద్, గోపి మున్నగువారు ఇప్పుడు మంచి స్థితిలో ఉన్నారు.

✦ **ఇక మీ వ్యక్తిగత జీవితం గురించి చెప్పండి!**

మా నాన్నగారు రావుసాహెబ్ భావరాజు సత్యనారాయణ గారు, చార్టెర్డ్ ఇంజనీర్....





మా అమ్మగారు శ్రీమతి వెంకాయమ్మగారు. మాది కాకినాడ. నా భార్య జోగేశ్వరి, మంచి పెయింటర్. చాలా పత్రికల్లో బొమ్మలు ప్రచురింపబడ్డాయి. గ్రాఫిక్స్‌డిజైన్ కూడా నాతోపాటు చేసేది. మా అమ్మాయి డా॥శ్రీపద్మావతి, సెంట్రల్ యూని వర్శిటీలో ప్రొఫెసర్. మా అబ్బాయి సత్యసాయి భాస్కర్, బి.కామ్., ఎమ్.బి.ఎ. ఇప్పుడు శ్రీసత్యసాయి డిజైనింగ్ స్టూడియో ప్రై.లి. మేనేజింగ్ డైరెక్టర్.

**✦ ప్రస్తుతం ప్రముఖ తెలుగు పత్రికలు ఒకో పత్రిక ఒకో కార్టూనిస్టల కార్టూన్లే ప్రచురిస్తున్నారు... దీనిపై మీ విశ్లేషణ?**

అది వాళ్ళిష్టం!... కార్టూనిస్ట్ యొక్క ప్రతిభ.

**✦ ఇప్పుడు తెలుగు కార్టూన్‌ల,కార్టూనిస్ట్‌ల పరిస్థితి ఏమిటి?**

ఇప్పుడు ప్రతిభ ఉన్న కార్టూనిస్ట్‌లకి యానిమేషన్ రంగం లో మంచి అవకాశాలు, ప్రోత్సాహం ఉన్నాయి. వార్తా పత్రిక ల్లో పొలిటికల్ కార్టూనిస్ట్‌లకి మంచి అవకాశాలు ఇస్తున్నారు. పత్రికలు కార్టూనిస్ట్‌లకి తగిన ప్రోత్సాహం ఇస్తే ఇంకా బాగా రాణించగలరు. ముఖ్యంగా కొత్తగా వస్తున్న కార్టూనిస్ట్‌లకి 'వర్క్‌షాప్‌లు' పెట్టి వారికి తగిన గైడెన్స్ ఇస్తే బాగుంటుంది.

**✦ పొలిటికల్ కార్టూనిస్ట్‌లనీ...సోషల్‌కార్టూనిస్ట్‌లనీ 'ఫోరం'లు ఏర్పాటు చేసుకుని ఎవరికి వారు విడివిడిగా కార్యా చరణలు ఏర్పరచుకోవటం మంచిదేనా?**

కానీ ఇద్దరు కలిసి ఎన్నో కార్యాక్రమాలు నిర్వహించారు కదా?

**✦ ఏ ఏ భాషల్లో మీ కార్టూన్లు ప్రచురించబడ్డాయి?**

పత్రికలో తెలుగు,స్కైలైన్ న్యూస్ పేపర్‌లో పొలిటికల్ కార్టూన్స్, బి.హెచ్.ఇ.ఎల్ లో క్వాలిటీ కార్టూన్స్, ఎస్.బి.ఐ. ఐ.సి.ఎమ్. వారి జర్నల్ లో ఇంగ్లీష్ కార్టూన్స్, స్ట్రిప్ కార్టూన్స్, ఆంధ్రప్రదేశ్ పత్రికలో ఉర్దూ కార్టూన్లు వచ్చాయి.

**✦ మీకొచ్చిన అవార్డులు రివార్డుల గురించి...?**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖసాంస్కృతిక సంస్థలనుండి చాలా అవార్డులు అందుకున్నాను. ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీకి 5సంవత్సరాలు కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నాను. హీరో నాగేశ్వరరావుగారి చేతులమీదుగా ఉగాది పురస్కార్ అవార్డ్, ఢిల్లీ ఎ.పి.భవన్‌లో శ్రీపి.వి.నరసింహరావుగారి చేతుల మీదుగా, ఎ.పి.జర్నలిస్ట్‌ల ఫోరం అవార్డు శ్రీ బాపుగారి చేతుల మీదుగా వచ్చాయి. బాలానందం సంఘంలో శ్రీరమణాచారి గారి ద్వారా సన్మానం. 1982లోఆంధ్రప్రదేశ్ ఉగాది పురస్కారం అవార్డు అప్పటిముఖ్యమంత్రి శ్రీనందమూరి తారక రామారావు చేతులమీదుగా; 1986లో 'వంశీ బర్కిలి బెస్ట్ కార్టూనిస్ట్ అవార్డు; 1977లో ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం; ఢిల్లీ తెలుగుసంఘం 24వ వార్షికోత్సవం సందర్భంగా 2002లో ఢిల్లీ తెలుగుసంఘం అవార్డు; 2002లో ఎ.పి.ప్రెస్ అకాడమీ అవార్డు, ఇంకా ఖమ్మం కళా పరిషత్, ఢిల్లీలో, విశాఖపట్టణంలో వివిధ సంస్థలలో సన్మానం.

**✦ యువ కార్టూనిస్ట్‌లకు మీరిచ్చే సలహా?**


పట్టుదల కృషి ఉండాలి. ఎదిగిన కొలది ఒదిగి ఉండాలి.

**✦ హాస్యానందంపై మీ అభిప్రాయం?**

మా అందరికి అభిమాన పత్రిక హాస్యానందం! మా అందరి ఆరోగ్యానికి కారణం హాస్యానందం!

**✦ మీకు తీరని కోరికలేమైనా ఉన్నాయా?**

శ్రీ బాపుగారి బొమ్మలో వందోవంతునైనా బాగా వెయ్యగలగాలని నా తాపత్రయం. ఐనా నేను రాక్ బాటమ్ లెవెల్లో ఉన్నాననే నా ఉద్దేశం. నా ఫొటో ఇచ్చి నా బొమ్మ వేయమని అడగాలని నా మనసులో ఉండేది. కానీ అందపెద్దాయన్నీ వేస్తారా అని అడగడం భయం. పైగా నా బ్రెయిన్‌ట్యూమర్ ఆపరేషన్ వల్ల నా మూతి వంకరయింది. ఇలాంటి ఫోటో పంపిస్తే బాగుండదని, దిష్టిబొమ్మల ఉంటుందేమోనని పంపలేదు. ఇప్పుడేం చేయాలా అని ఆలోచిస్తున్నాను.


చిరంజీవి సత్యమూర్తి నాకు చిరకాల మిత్రుడు.

15.12.13

**నా**కు చిన్నప్పటి నుండి జోకులన్నా కార్టూన్లన్నా ఇష్టం. 10 క్లాసు వచ్చేటప్పటికి అందరి కార్టూనిస్టుల సంతకాలను కాపీ చేసుకొనే వాడ్ని. ఆ క్రమంలో చదువు(ల్రావు అని ఓ కార్టూన్ సిరీస్ వస్తూండేది. కళ్ళద్దాల్లో చుక్క ఆ బొమ్మ ఇప్పటికీ గుర్తే.

ఆ తరువాత బి.వి. పట్టాభిరామ్‌తో పరిచయం, బి.వి. సత్యమూర్తి గారితో పరిచయం అలా సాగింది.

కార్టూనిస్టుల్లో చాలా హుందా అయిన వ్యక్తి. ఆయనకామధ్య ఒంట్లో బాగో లేదని విన్నాను. అయినా కార్టూన్లు వేయడం మానలేదు ఆయన. ఆ కార్టూన్ పెద్దకి నా నమస్కారం.

**-తనికెళ్ల భరణి**



**ఒరిజినల్ గీతలతో**
**మురిపించెను సత్యమూర్తి,**
**ముందు తరముకున్**
**గురువై కార్టూన్ నేర్పిరి**
**మురిపించిరి వ్యంగ్య చిత్ర**
**మహితయె వెలగన్!**

**-బ్నిం**



**విధిని గెల్చిన నవ్వు అది.**

సత్యమూర్తిని మొదటిసారి కలిసి పాతిక సంవత్సరాలైంది.

ఆయన ఫ్రెష్‌నెస్‌తో కూడిన చిరు నవ్వు నాకు ఇప్పటికీ గుర్తుంది. విధిని గెల్చిన నవ్వు అది.

ఆయన బాబాకి గొప్ప భక్తుడు. May baba give him more youthful and peaceful life.

**-యండమూరి వీరేంద్రనాథ్**




## సత్యమూర్తి-కార్టూనిస్ట్



**కా**ర్టూనిస్ట్ సత్యమూర్తిగారితో నాకు ఎన్నో సంవత్స రాలుగా పరిచయం ఉంది.

ఆయన నాకంటే చాల సీనియర్ కార్టూనిస్ట్ అయి నా... నేను సీనియర్‌ని, మల్లిక్ జూనియర్ అనే 'ఈగో' లేకుండా మా ఇంటికి వచ్చేవారు.

నాకు డ్రాయింగ్ పెన్స్ గురించి అంతగా తెలియ నప్పుడు తన దగ్గర ఉన్న అన్ని రకాల పెన్నులూ... బ్రష్‌లూ నాకు చూపించి... ఏవేవి ఎక్కడ దొరుకు తాయో చెప్పారు... అఫ్‌కోర్స్ వేరే సీనియర్స్‌ని నేను అడిగినా చెప్పకుండా దాటేశారను కోండి... అది వేరే విషయం.

పైకొచ్చే వాడు ఎలాగైనా వచ్చి చస్తాడు.... రాలేని వాడు ఏం చేసినా పైకిరాడు.


సత్యమూర్తిగారు కార్టూనిస్ట్ అని మాత్రమే అందరికీ తెలుసు... కానీ ఆయన పెద్ద కమర్షియల్ ఆర్టిస్ట్ అని చాలా మందికి తెలీదు. సత్యమూర్తిగారి కార్టూన్ ఫీచర్స్‌లో నాకు 'చదువుల్రావు' అంటే చాలా ఇష్టం.

ఆయన కార్టూనుల్లో వైవిధ్యం కనిపిస్తుంది.... గీతల్లో కూడా వెరైటీ ఉంటుంది.

నేను 1994 దాకా విజయనగర్‌కాలనీ దగ్గర పి.ఎస్.నగర్‌లో ఉండేవాడిని. ఆయన మా ఇంటికి దగ్గర్లోనే ఉండేవారు. అప్పుడు మేమిద్దరం అడపా దడపా కలిసేవారం.

సత్యమూర్తిగారు ఇలాంటి పుట్టిన రోజులు ఎన్నెన్నో చేస్కోవాలనీ... జీవితాంతం ఆయన కార్టూన్లు వేస్తూనే ఉండాలనీ నేను ఆశిస్తున్నాను. ఆయన పుట్టినరోజు సందర్భంగా హాస్యానందం ఆయన ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాందుకు రాముగారిని అభినందిస్తున్నాను.

**-మల్లిక్**













నిన్ను రెండేళ్ళు సేనాధిపతిగా నియమిస్తున్నాం. నీ శక్తి యుక్తులు నిరూపించుకుంటే మరికొన్నేళ్ళు పొడిగిస్తాం
చిత్తం
మొత్తం రాజ్యాన్ని కొల్లగొట్టుకు తినడానికి రెండేళ్ళు నాకు ఎక్కువే



నేను కనిపించినప్పుడల్లా వాదించుకోడం మానేస్తున్నారు. అసలు మీలో ఎవరు నెగ్గుతారో చూడాలని ఉంది


ఈ డ్రెస్సు బాగా లేకపోతే బాగా లేదని చెప్పండి. ఇలా వెధవ్వేషాలెయ్యొద్దు
నాకసలే చిరాకు


......సినిమా హాల్లోంచి గెంటేశారు కదాని నేను చెప్పదలుచుకున్నది చెప్పడం ఆపేస్తాననుకోకండి... పైగా.........
సత్యమూర్తి



అంతా మీదే తప్పు అని చెప్పడానికేమీ ప్రయత్నించడంలేదు. మీదే తప్పు అని ఖచ్చితంగా చెప్తున్నాను
సత్యమూర్తి


మహామంత్రీ! ఎవరతను పొద్దున్నించీ నన్ను నీడలా వెంటాడుతున్నాడు?!
ఇప్పుడే కనుక్కుంటాను, ప్రభూ
మన మంత్రివర్గములోనివాడేట ప్రభూ! ఏడాదినించి తమరు ఏ శాఖ అప్పగించలేదుట. అది తమకు విన్నవించుకోడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్తున్నాడు, ప్రభూ


ఓ సారి ఇటు చూడండి. ఈ చీర 15 వేలుట
ఇదేమో 2 వేలుట. మీకిది బాగుంది... దసరా పండుగ కదండీ.
నిజం చెప్పాలంటే, నువ్వు కట్టుకుంటే ఈ చీరకే అందం వస్తుంది. నీ ఒంటి రంగుకి ఇది బాగా మ్యాచ్ ఔతుంది
ఇది రెండు వేలే. సరేలెండి, మిమ్మల్ని చిన్నబుచ్చడం నాకిష్టం లేదు. ఇదే తీసుకుంటాను
నాకేమో ఈ 15 వేల చీర నచ్చింది. అదే తీసుకుంటున్నాను.




# అసాధారణ కార్టూనిస్టు ఆరడుగుల ఆత్మ విశ్వాసం!



**–జయదేవ్.**

***సత్యమూర్తిగారు మద్రాసు రాకుంటే...*** *నేను వారిని రిసీవ్ చేసుకోకుంటే... బాపు గారిని 1976లో గాక, మరో పదేళ్ళాగి కలిసుండేవాడినేమో!*

***సత్యమూర్తిగారు మద్రాసు రాకుంటే...*** *యాడ్ ఏజన్సీలు నడిపేవాళ్ళ ఆరాటాలూ, పోరాటాలూ, అద్భుతాలూ, నాకు బొత్తిగా తెలిసే అవకాశం కలిగుండేది కాదేమో!*

***సత్యమూర్తిగారు మద్రాసు రాకుంటే...*** *మా ఇంట్లో అంతటి అసాధారణమైన కార్టూనిస్టుకు మా ఆవిడ రుచికరమైన కొబ్బరిపచ్చడి భోజనం వడ్డించేది కాదేమో! అది తినేభాగ్యం నాకు కలిగుండేది కాదేమో!*

సత్యమూర్తిగార్ని మద్రాసులో కలవక ముందు, వారిని ఖమ్మంలో తెలుగు కార్టూనిస్టుల కాన్ఫరెన్సులో కలిశాను. కరచాలనం చేసీ చేయకముందే ఆయన ఆప్యాయంగా నా భుజం మీద చెయ్యి వేసి దగ్గరికి లాక్కుని కార్టూన్ ప్రపంచంలో అడుగు పెట్టిన నాకు ఒక గుర్తింపు దక్కించారు. అప్పటి నుండి ఇప్పటిదాకా ఆయన తన స్నేహితుల జాబితాలో నాకు స్థానం కల్పించి ఆప్యాయంగా పలకరిస్తూంటారు. ఉత్తరాలు రాస్తారు. కబుర్లు చెబుతుంటారు. జోకులు విసిరి హాయిగా నవ్విస్తూంటారు.

ఇప్పటి తెలుగు కార్టూనిస్టుల్లో గురుదేవులు పద్మశ్రీ బాపుగారి మినహా, సీనియర్ మోస్ట్ కార్టూనిస్ట్ సత్యమూర్తి గారే!

19.08.1959లో ఆంధ్ర సచిత్ర వారపత్రిక కార్టూన్ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకుని ధన్‌మని రంగప్రవేశం చేశారు. కొత్త గీతలు, ఎవరి ప్రభావమూ తన మీద గోచరించని స్టైలూ, ఒరవడి, పంచ్‌లతో, దాదాపు ఒక పంచాంగం కాలంగా తెలుగు పాఠక లోకాన్ని నవ్వులతో ముంచెత్తుతున్నారు సత్యమూర్తిగారు.

వేల సంఖ్యలో కార్టూన్లు, ఇలస్ట్రేషన్లూ, లోగోలూ, కవర్ డిజైన్లు, వీటితో పాటు తను స్థాపించిన యాడ్ ఏజన్సీకి అవసరమైన కన్నుల పండుగ చేసే బొమ్మలూ, సత్యమూర్తిగారిని చిత్ర కళారంగంలో ఉన్నత శిఖరం మీద కూర్చోబెట్టాయి. ఆయన్ని ఈ విధంగా అనుకరించిన వారు నాకు తెలిసి వేరే ఎవరూ లేరు.

సత్యమూర్తిగార్ని పలుమార్లు వారి స్టూడియోలో కలిశాను. వారు పని చేసే తీరును శ్రద్ధతో గమనించాను. వారి 'వర్క్ స్టేషన్' వారు ఉపయోగించే పనిముట్లూ, పెన్నులూ, బ్రష్షులూ, జామెట్రీ బాక్సు సాధనాలూ (వీటిని ఆర్కిటెక్టు ఉపయోగిస్తారు) నన్ను ఆశ్చర్య పరిచాయి.

ఇటువంటి ఆచార్యుడు, చిత్ర రంగంలో ప్రవేశించిన విద్యార్థికి సరైన ఉపదేశం ఇవ్వగలడని తోచి ఆయన్ని హార్ట్ యానిమేషన్ అకాడమీకి ఆహ్వానించాను. అక్కడి విద్యార్థుల 'స్కిల్సు'ను పరీక్షించి వారికి తగిన సలహాలందించి, వారి స్థానాలని వారు అర్థం చేసుకొనే అవకాశం ఏర్పరచవలసిందిగా కోరాను. నామీద అభిమానం కొద్దీ తన పనులను పక్కన పెట్టి వచ్చారు. ప్రతి విద్యార్థిని ఆచి తూచి పరిశీలించి వాళ్ళకి గ్రేడింగ్స్ ఇచ్చారు. అది యానిమేషన్ విద్యార్థులకెంతో తోడ్పడింది. కనువిప్పు కలిగింది.

సత్యమూర్తి ఎంత గంభీరంగా కనిపిస్తారో... అంత గంభీరంగా ఆలోచిస్తారు కూడా. అందుకే ఎవరూ సాహసించని యాడ్ ఏజన్సీ రంగంలో కత్తిమీద సాము వంటి ఉద్యోగం తనకు తానే కల్పించుకున్నారు.

"యూవార్ గ్రేట్' అంటే, 'భలేవారు... ఇప్పుడు నా బూట్లు చప్పుడుతో ఒక కర్ర కూడా చప్పుడు చేస్తున్నద'ని జోకులు విసురుతారు.

సత్యమూర్తి అందగాడు. ఆ మధ్య జబ్బు చేసి ఆయన అందం కొంత తగ్గింది. అది చూసి నేను అరాయించుకోలేక పోయాను. సికరాజుగారి ముందు భోరున ఏడ్చాను. సికరాజు గారన్నారు– "సత్యమూర్తిగారి అందం బైట మాత్రమే రవ్వంత తగ్గింది. లోపల మరింత ప్రకాశవంతంగా ఉంది" అని నన్ను ఓదార్చారు.

నిజమే! ఒంట్లో బాగోలేకపోయినా... ఆయన సాధన చేయటం మానలేదు. తన అస్వస్థతను తానే అవతలకి నెట్టివేశారని చంద్రగారు చెబుతుంటారు. అలుపు, నొప్పి ఎరుగని, ఆరడుగుల ఆత్మ విశ్వాసాన్ని, పిడికిట్లో పట్టుకుని హుందాగా కనబడే సత్యమూర్తిగార్ని చూస్తే, మనం కూడా మన బాధలని మరచిపోతాం. మన కర్తవ్యం ఎరిగి, ధైర్యంగా ఆ వంక నడుస్తాం.

సత్యమూర్తి గారికీ, నాకూ మధ్యన మరొక వ్యక్తి వున్నాడు. మా ఇద్దరికీ గిలిగింతలు పెడుతుంటాడు. నవ్విస్తాడు. స్ఫూర్తి నందిస్తాడు. వాడొక డ్రైవరు.

*'He drives us crazy'.*

# చదువు(శ్రా)వు మా నాన్నగారు!

నేను 1999వ సం॥లో ఢిల్లీలో పని చేస్తూ ఉండగా వరంగల్ ఆర్.ఈ.సీ.లో మేథమేటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన ఒక కాన్ఫరెన్స్‌కి వెళ్ళడం జరిగింది.

నేను మాట్లాడవలసిన సమయానికి ముందు ఆ కాన్ఫరెన్స్ ప్రధాన నిర్వాహకులు ప్రొఫెసర్ శ్రీ టి.కె.వి. అయ్యంగార్ గారు నన్ను పరిచయం చెయ్యాలి.

నేను స్టేజి మీదకు వెళ్తూండగా ఆయన "ఈవిడ ఐ.ఐ.టి, ఢిల్లీలో మేథమేటిక్స్ డిపార్ట్‌మెంట్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. కానీ ఈవిడని నేను ఇప్పుడు



ఇంకో విధంగా పరిచయం చేయబోతున్నాను. అది ఏంటంటే ఈవిడ చదువు(శ్రా)వు గారి అమ్మాయి. అంటే ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ బి.వి. సత్యమూర్తిగారి అమ్మాయి ..." అంటూ తను మా నాన్నగారి కార్టూన్లను ఎంతో అభిమానిస్తానంటూ నన్ను పరిచయం చేశారు.

ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగి నాకు ఎంతో ఆనందం కలిగిస్తూంటాయి. ఎంతో మంది మా నాన్నగారు ఎవరో తెలిశాక "మీరు సత్యమూర్తిగారి అమ్మాయా? ఆయన వేసిన చదువు(శ్రా)వు కార్టూన్ల కోసం మేము ప్రతి వారం ఎదురుచూసేవాళ్ళం. ఆ కార్టూన్లు కట్ చేసి దాచుకొనే వాళ్ళం" అని ఇప్పటికీ చెప్తూం టారు.

ఆ శీర్షిక ప్రచురణ అయినప్పుడు నేను పుట్టకపోయినా అది ఎంత ప్రజాదరణ పొందిందో... ఎంత సంచలనం సృష్టించి ఉంటుందో వారు చెప్పిన విశేషాల వలన అర్థమవుతుంది.

ఏదైనా బేంక్‌కి వెళ్ళినప్పుడు అక్కడ సీనియర్ ఉద్యోగులు, ఏదైనా హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు అక్కడి సీనియర్ డాక్టర్లు, స్నేహితుల తల్లిదండ్రులు చిన్నప్పుడు మా స్కూల్లో, కాలేజీలో, ఆ తరువాత నేనిప్పుడు పనిచేసే యూనివర్సిటీలో టీచర్లు, ఉద్యోగులు ఎందరో ప్రముఖులు మా నాన్నగారి అభిమానులమని చెప్పినప్పుడు నాకెంతో సంతోషంగా ఉంటుంది.

నన్ను చిన్నప్పుడు మా నాన్నగారు 'అమ్మాయి గారు' అని పిలిచేవారు. మా నాన్నగారు రాత్రింబవళ్ళు పనిలో బిజీగా వుంటే చిన్నప్పుడు నాది, మా తమ్ముడు భాస్కర్‌ది చదువు విషయం మా అమ్మగారే చూసుకునే వారు. అయినా తీరిక వేళల్లో మా నాన్నగారు నాకు పెయింటింగ్, డ్రాయింగ్ నేర్పించేవారు. మా తమ్ముడికి కూడా. ఆయన చదువులో ఎక్కువ జోక్యం కలిగించుకోకపోయినా ఆయనని చూసి కష్టపడి పనిచెయ్యడం నేర్చుకున్నాను. ఆయనకి పనిపట్ల ఉన్న ఏకాగ్రత, శ్రద్ధ ఇప్పటికీ కష్టపడి పనిచేయడం నన్ను ప్రభావితం చేసాయని నాకు అనిపిస్తుంది.

చిన్న చిన్న విషయాలకి తీవ్రంగా స్పందించి, మానసికంగా కృంగిపోయేవారికి మా నాన్నగారి గురించి చెప్పాలనిపిస్తుంది. ఆయన ఎక్కిన ప్రతీ మెట్టు వెనకాల ఎంతో పట్టుదల, కృషి, మానసిక ధైర్యం ఉండడమే దీనికి కారణం.

తనవంతు కృషి చేసి దైవం మీద భారం వేసి తర్వాత ఏం జరిగినా దానిని దైవ నిర్ణయంగా తీసుకోగలగడం వలన జీవితంలో ఒడిదుకులను తట్టుకో గలిగారు. దేవుడెప్పుడు తనవెంటే ఉంటాడని నమ్మడమే దీనికి కారణమనుకుంటా.

1984లో జరిగిన ఒక సర్జరీ వలన ఆయన కుడి చేయికి, కాలుకి పూర్తిగా పెరాలసిస్ వచ్చి ఆయనకి ఒక గీత కూడా గీయడం సాధ్యం కాలేదు. కానీ ఏడాదిన్నర తర్వాత కోలుకొని ఆయన పూర్తిగా ఇదివరకటిలా బొమ్మలు వేయగలిగారు. దానికి కారణం ఆయన నమ్మిన భగవంతుని దయతో పాటు ఆయన ఫిజియోథెరపీ తీసుకొని ఎంతో పట్టుదలతో, దీక్షతో రకరకాల ఆకారాల గీతలు, డ్రాయింగ్, తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలు ప్రాక్టీస్ చేసేవారు. కొన్ని వందల పేజీల కాపీ రైటింగ్ రోజూ నుంచి మళ్ళీ మామూలుగా ఆయన పనిని ఆయనే చేసుకొంటూ, ఎప్పటిలా బొమ్మలు, కార్టూన్లు వేయగలిగారు.

ఆ సమయంలో మా అమ్మ, నాన్నగారి తరపు బంధువులు మా పట్ల చూపించిన ప్రేమ వలన మేము ఎటువంటి అభద్రతా భావం లేకుండా ఉండేవారము. ముఖ్యంగా మా నాన్నగారి చిన్నన్నయ్య శ్రీ బి.వి.రమణరావు గారు జీవితంలో అన్ని సందర్భాల్లోను మా నాన్నగారికి అన్ని రకాలుగా అండగా వుండి, ఎంతో ధైర్యాన్ని ఇచ్చేవారు.

ఇప్పటికీ రోజంతా కార్టూన్లు వేయడం మా

నాన్నగారికి ఇష్టం. రోజంతా చురుకుగా, ఉత్సాహంగా ఉండటానికి కార్టూన్లు వేయడం మానొద్దని ఒక డాక్టరు గారు కూడా అన్నారు ఆయనతో.

పుస్తకాలు చదవడం, పని చేస్తున్నంతసేపు బాక్‌గ్రౌండ్‌లో కున్నుక్కుడి వైద్యనాథన్ గారి వయోలిన్, శ్రీనివాస్ మేండోలిన్, రాజ్‌కపూర్ పాటలు, సైగల్, ముఖేష్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాటలు లేదా బాబాగారి పాటలు, ఉపన్యాసాలు వింటూ పనిచేసుకోవడం ఆయనకి అలవాటు. ఆయన కూడా మౌత్ ఆర్గన్ వాయించేవారు.

మంచి పర్సనాలిటి కలిగి, మౌత్ ఆర్గన్ వాయిస్తుంటే చదువు్రావ్ శీర్షిక ద్వారా పేరు ప్రఖ్యాతులు పొందిన మా నాన్నగారికి కాలేజి పిల్లలు ఎంతోమంది ఫాన్స్ ఉండేవారని చంద్ర అంకుల్ లాంటి వారు చెప్తూ ఉంటారు.



మా అమ్మకి కూడా కర్ణాటక సంగీతంలో ప్రవేశం ఉంది. ఎన్నో పెయింట్స్ వేసేది. బహుశా అందుకే మా తమ్ముడు సాయి భాస్కర్ కి సంగీతంలోనూ, బొమ్మలు వేయడంలోనూ ఆసక్తి, ప్రావీణ్యం కలిగాయి. చిన్నప్పటి నుంచీ మా నాన్నగారి డిజైనింగ్ ఎడ్వర్టయిజ్‌మెంట్ బిజినెస్‌లో ప్రవేశం చేశాడు.

కార్టూన్లు ఎలా వెయ్యాలనే విషయంపై మా నాన్నగారు వ్రాసిన పుస్తకాలను ఎప్పుడైనా నా స్నేహితుల పిల్లలకిచ్చినప్పుడు వారు వాటిని చూసి బొమ్మలు వేయడం నేర్చుకోవడంలో ఆసక్తి చూపించినప్పుడు నాకెంతో గర్వంగా ఉంటుంది.

మా నాన్నగారి 75వ పుట్టినరోజు సందర్భంగా హాస్యానందం ఆయన గురించి ప్రత్యేకంగా ప్రచురిస్తున్నందుకు నా కృతజ్ఞతలు.

ఈ సందర్భంగా మీ అందరి శుభాకాంక్షలు మా నాన్నగారికి, అమ్మగారికి తద్వారా మా అందరికీ చేరాలని కోరుకుంటున్నాను.

**-బి.శ్రీపద్మావతి,**
మేథమేటిక్స్ ప్రొఫెసర్,
యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్

## అందరికీ ఇది హేపీ న్యూ ఇయరే!



*శ్రీసత్యమూర్తిగారంటే నాకు ఎంతో గౌరవ అభిమానం. జనవరి2014 కొత్త సంవత్సరం. ఈ నూతన సంవత్సరంలో హాస్యానందంలో అందరికీ అభిమానులు, ఆత్మీయులు ప్రముఖ కార్టూనిస్ట్ అయిన శ్రీసత్యమూర్తి గారి కార్టూన్ వైభవం వస్తుందంటే...*

*నిజంగా అందరికీ హేపీ న్యూ ఇయరే కదా!*

*శ్రీసత్యమూర్తిగారి కార్టూన్లు నేను చిన్నప్పట్నుంచీ చూస్తున్నాను. వారి బొమ్మలూ,కార్టూన్లు భలే వెరైటీగా వుంటాయి. ఆయన ఎవర్నీ అనుసరించరు. ఆయన్నీ ఎవరూ ఎవరూ అనుకరించలేరు. ఆ రోజుల్లో ఆయన వేసే చదు్రావు కార్టూన్లు చదివి తెగ నవ్వుకునే వాళ్ళం. (మళ్ళీ మాకు చదువు్రావు కావాలి సార్)*

*ఒకసారి నేను శ్రీసత్యమూర్తిగారికి నా డౌట్స్ కొన్ని తెలుపుతూ లెటర్ రాసాను. కొద్దిరోజులకి ఆయన ఆశీస్సులతో చక్కని జవాబు రాస్తూ-బోల్డన్ని నిబ్బులూ... క్రోక్విల్ పెన్నులూ... ఇండియన్ ఇంకులూ... పెన్సిళ్ళూ... రబ్బర్లూ... ఆయన రాసిన 'కార్టూన్లు వెయ్యటం ఎలా?' అనే బుక్స్ ఇవ్వన్నీ శ్రీసత్యమూర్తిగారు నాకు కొరియర్‌లో పంపించారు. నేను విస్తుపోయాను.*

*వారి అభిమానానికీ ఆత్మీయతకూ ఎంతో సంతోషం కలిగింది.*

*శ్రీసత్యమూర్తిగారు ఆయురారోగ్యాలతో ఎప్పుడూ కార్టూన్లు వేస్తూనే ఉండాలని మనసారా ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.*

**-కుమారి రాగతిపండరి,** కార్టూనిస్ట్, విశాఖపట్టణం.




## ఆయన పరిచయం ఓ అదృష్టం!

*శ్రీ సత్యమూర్తిగారు మా నాన్నగారికి బాగా పరిచయం. 1976లో నేను కార్టూన్లు గీయడం మొదలెట్టాక మా నాన్నగారు శ్రీ సత్యమూర్తి గారిని పరిచయం చేశారు. ఆ తరువాత వారిని అనేకసార్లు వారి ఆఫీస్‌లో కలుసుకోవడం జరిగింది.*

*శ్రీసత్యమూర్తిగారు మృదుస్వభావి.*

*పేరుకు తగ్గట్టుగా సత్యం మాత్రమే పలుకుతారు. ఎంతో బిజీ అయినా, ఆయనతో కొన్నిసార్లు కార్టూన్ వర్క్‌షాప్‌లను నిర్వహించాను. కొన్నిసార్లు ఎగ్జిబిషన్‌లకు ముఖ్య అతిథిగా విచ్చేసి, తన అమూల్య సందేశాల్ని సోదర కార్టూనిస్ట్‌లకు అందజేసారు.*

*భగవంతుని పట్ల విశ్వాసం అపారంగా కలిగిన శ్రీ సత్యమూర్తిగారు... బ్రెయిన్ ఆపరేషన్ జరిగిన తరువాత మొక్కవోని ధైర్యంతో ఎంతో పట్టుదలతో కృషితో మళ్ళీ కార్టూన్లు గీయడం మొదలెట్టి మాలాంటి వాళ్ళకు స్ఫూర్తి నిచ్చారు.*

**-జి.ఎస్.ఆర్, కార్టూనిస్ట్**

# గుర్తుకొస్తున్నాయి.....













UTSAV-2002
MARCH 9-10















## అందమైన కార్టూన్ ప్రపంచం.




నేను కార్టూన్లు వేయడం ప్రారంభించిన తొలిరోజుల్లో సత్యమూర్తిగారి కార్టూన్లు ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌తో నన్ను అమితంగా ఆకట్టుకునేవి. ఇండియన్ ఇంక్ కూడా ఎక్కడ దొరుకుతుందిరా బాబూ అని బుర్రగోక్కుంటున్న సమయంలో పాళీలతో... డిఫరెంట్ పేటర్న్‌లతో... పొందికగా, శాస్త్రీయంగా నిబ్స్‌తో ఆయన బొమ్మలు చూడముచ్చటగా వుండేవి. అందమైన కార్టూన్ బొమ్మలు ఆయన ప్రత్యేకత. ఆయన వేసిన అడ్వర్టయిజ్‌మెంట్ కార్టూన్లు ఇప్పటికీ కొన్ని గుర్తువున్నాయి. బహుశా తెలుగులో ఇటువంటి ప్రయోగాలకు ఆయనే ప్రారంభకులేమో.



కార్టూన్లు వేయడం ఎలా? అనే పుస్తకం ఇప్పటికీ చక్కగా చదువుకోవలసిన రిఫరెన్స్ పుస్తకం. అందమైన కార్టూన్ ప్రపంచాన్ని, అమ్మాయిలను, అబ్బాయిలను, పిల్లలను సృష్టించిన ఆయన కార్టూన్ ప్రపంచం ఏ పాశ్చాత్య యానిమేషన్ ప్రపంచానికి తీసిపోదు.

కళాకారుడికి విశ్రాంతి,తృప్తి లేదని అన్నట్లుగా ఆయన ఇప్పటికీ చక్కటి కార్టూన్లు వేయడం బాగుంది. ఆయనకు గౌరవప్రదమైన పురస్కారాలు మరిన్ని అందాలని, సంతోషంగా వుండాలని హాస్యానందంగా కోరుకుంటూ... **-హరి**, విశాఖపట్నం





శ్రీ బి.వి.సత్యమూర్తిగారు నేను కార్టూనిస్ట్‌గా మారక ముందు నుంచి ఆంధ్రప్రదేశ్‌ను 'చదువుర్లావు' పేరుతో ఏలారు.

నాకు ఒక గరువులాంటివారు. స్నేహశీలి, మంచి గుణాలన్ని పోతపోసి సత్యమూర్తిగార్ని సృష్టించాడు ఆ చతుర్ముఖ బ్రహ్మ...

ఇది సత్యం! **-ఏవిఎమ్.**

## మరువలేని ఫోన్‌కాల్



సీనియర్ కార్టూనిస్టులలో సత్యమూర్తిగారు ఒకరు. తెలుగు పత్రికలలో వచ్చిన ఆయన కార్టూలన్నీ నేను చూశాను. ఎవరూ ఆలోచించని కొత్త కోణాల్లో కార్టూన్లు గీశారు. అయితే 2007లో నేను గీసిన ఒక కార్టూన్ చూసి బాగా గీశారంటూ ఫోన్‌చేసి నన్ను అభినందించారు. అది నేను మరచిపోలేని సంఘటన.

2013 మే నెలలో జరిగిన తలిశెట్టి అవార్డు ప్రదానోత్సవ సభలో వారిని ప్రత్యక్షంగా చూశాను. కాసేపు ముచ్చటించుకున్నాము. ఇది నేను జీవితంలో మరచిపోలేను.

**-డాక్టర్ రావెళ్ళ**



# మంచి మిత్రుడు సత్యమూర్తి.

– బాలి



***1970***ప్రాంతాల్లో అనుకుంటాను.

ఆంధ్రపత్రిక వార పత్రికలను అనకాపల్లిలో మా ఇంటికి దగ్గర్లో ఉన్న సర్వ కామదాంబ పార్క్‌లో ఉన్న లైబ్రరీలో తిరగేస్తూ ఉండే రోజుల్లో శ్రీ సత్యమూర్తి గారు వేసే కార్టూనే స్ట్రిప్ 'చదువ్వులావ్' కనపడేది. అది ఆ రోజుల్లో చాలామంది పాఠకుల్ని ఆకట్టుకొనేది. ఇది గ్రహించి కాబోలు ఆ పత్రిక సంపాదకీయ వర్గం 'చదువ్వులావ్' కేరక్టర్స్‌తో చిన్న జోక్ చేర్చి రంగుల్లో ముఖ చిత్రంగానూ వేశారు.

అవి చూసి అబ్బో అనుకున్నాను.

ఆ తరువాత రోజుల్లో అక్కడక్కడా పత్రికల్లో సత్యమూర్తిగారు చాలా కంపెనీలకు (ప్రెస్టేజ్ కుక్కర్స్) కార్టూన్లతో వేసిన ప్రకటనల డిజైన్లను చూశాను.

థిక్ అండ్ థిన్‌లైన్లతో వేసే ఆయన రేఖల్లో ఆయనదో ప్రత్యేక శైలి. ఇప్పటికీ అవే రేఖలు. అవే అక్షరాలు.

ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు 'ఈనాడు' దినపత్రికలో కార్టూనిస్ట్‌గా నేను చేరి, విశాఖపట్నంలో ఒక సంవత్సరం పని చేసిన తరువాత మూటా, ముల్లే సర్దుకొని హైదరాబాద్ వెళ్ళాం. ఇక ఆ రోజుల్లో అబిడ్స్‌లో ఉండే ఆ ఆఫీస్‌కు చాలామంది కార్టూనిస్ట్ లు వచ్చేవారు. వారితో నాకు పరిచయాలు కలిగేవి. అలా వచ్చిన వారిలో సత్యమూర్తి గారు ఒకరు. మంచి పర్సనాలిటీ. అందరితో కాస్సేపు సరదాగా మాట్లాడి స్కూటర్‌లో వెళ్ళిపోయేవారు. అప్పట్లో ఆయన విజయ నగర్ కాలనీలో ఉండే వారు. ఒకమారు నన్ను ఆయ నింటికి తీసు కెళ్ళిన గుర్తు. టేబుల్‌పై సగం సగం తయారు చేసిన డిజైనులుంటే, క్రింద చెత్తబుట్టలో కత్తిరించిన అక్షరాలున్నాయి. అప్పట్లో అక్షరాలను మనకు కావలసిన సైజుకే ప్రింట్స్ వేసుకొని కత్తిరించి అంటించుకోవాలి.

ఇవన్నీ ఆ ఇంట్లోని ఓ గదిలో ఉన్నాయి.

అదే ఆయన స్టూడియో.

ఈ డిజైనింగ్ స్టూడియో వల్ల నెలకు ఓ పదివేలన్నా సంపాదిస్తారు" అని ఓ చిత్ర కళామిత్రుడు వ్యాఖ్యానించాడు కూడా.

అది ఆ రోజుల్లో చాలా గొప్ప.

ఆ తరువాతి రోజుల్లో నేను ఈనాడు విడిచిపెట్టి ఆంధ్రజ్యోతి విజయవాడ వెళ్ళి పోయాను. యానిమేషన్‌లో అవకాశం వస్తే తిరిగి హైదరాబాద్ చేరుకొన్న తరువాత కూడా మా మధ్య గల పరిచయం అలాగే కొనసాగుతోంది. వీలు చిక్కినప్పుడల్లా లకడీకాపూల్‌లో ఉన్నవారి ఆఫీస్‌కి వెళ్ళడం కబుర్లు చెప్పుకోవడం... ఆ కబుర్లన్నీ బొమ్మలు వేసే విధానం గురించీ, పాళీలు, కలాలు, ఇంకులు గురించే... వారు అభిమానంగా ఇచ్చిన మేలురకం పాళీలు ఇంకా నా వద్ద ఉన్నాయి.

వీరి ఆంధ్రభూమిలో కార్టూన్‌లు గీయడం ఎలా? అనే ఫీచర్ పుస్తక రూపంలో వచ్చింది. ఆ పుస్తకాన్ని అభిమానంగా ఇచ్చారు సంతకం చేసి. సంతోషమే.

దానిలో చాలామంది ప్రముఖుల ముందు మాటలున్నాయి. బీరువాలో దాచిన ఆ పుస్తకం ఎదురుపడితే తిరగేస్తుంటాను. ముందు మాటలూ చదువుతాను. పేరెందుకు గానీ అందులోని ఓ ఉత్తమ ప్రముఖుడు ఇలా రాశాడు.

"... ఓ ఫీచర్ సృష్టించి దాన్ని కార్టూనిస్టుల మధ్యకు తీసుకెళ్ళి ఓ అద్భుతమైన ఓ నిశ్చల చిత్రానికి చలనం తెచ్చారు సత్యమూర్తిగారు. నా దృష్టిలో ఆయన ఓ ఇండివిద్యువల్ కాదు... ఒక ఇండస్ట్రీ... ఆ ఇండస్ట్రీ యానిమేషన్ రంగానికి ఈ రోజు కావాలి."–అని.

గొప్పగా ఉన్నాయి ఈ మాటలు.

ఈ మాటల టోపీలూ చాలామంది ఆర్టిస్టుల తలల మీద పడ్డాయి.

అందులో ఇదొకటి.






# కార్టూన్ల తాయెత్తు కానుకగా ఇచ్చి దీవించిన ఆత్మీయులు- చదువుల్రావు



**ఓం** శ్రీ సాయిరాం.... **మ**న సత్యమూర్తిగారి గురించి అనుకోవాల్సివస్తే, ఇలానే ప్రారంభించాలనిపిస్తుంది. ఆయన అంత గొప్ప సాయి డివోటీ కావడమే అందుకు మొదటి కారణం కాగా, దీన్ని నేను ప్రశాంతినిలయం ఆవరణలో కూర్చొని రాస్తున్నా నన్నది రెండో కారణం.

నాకు శ్రీ గోపులుగారు పరమగురువు, శ్రీ బాపు తొలి గురువులు కాగా, నా మలి గురువు శ్రీ సత్యమూర్తిగారే.




1959-60 ప్రాంతాల్లో, నేను ఆంధ్ర సచిత్రవారపత్రిక్కి వీరాభిమానిగా వుండే రోజుల్లో, బాపూగారి 'ఎప్పుడూ ఇంతే' కార్టూన్ల కోసం, ఆంధ్రప్రభ దినపత్రికలో వచ్చే ఆయన 'మన వాళ్ళు' పాకెట్ కార్టూన్ల కోసం ఎంతగా పడి చచ్చేవాణ్ణో, అంత గాఢంగానూ మన సత్యమూర్తిగారి 'చదువు ల్రావు' ఫుల్ పేజీ కార్టూన్ల కోసం కూడా మొహం వాచిపోయే వాణ్ణి. అప్పట్లో కనబడే వాళ్ళిద్దరి కార్టూన్లను చూస్తూ, వారికి ఏక లవ్య శిష్యుడిగా వారి బొమ్మల్ని అనుకరించి గీయడానికి ప్రయత్నిస్తూ... నా కార్టూన్ల అ ఆ లు దిద్దుకునే వాణ్ణి.

చివరికి, వాళ్ళిద్దరి తరహాల ప్రభావం కనిపించే కార్టూన్ల శైలి నాదయింది. నాకు కనబడ్డ ప్రతి బాపు బొమ్మనీ, కార్టూన్ని ఎలా జాగ్రత్త పరిచానో, అదే విధంగా సత్యమూర్తి గారి చదువుల్రావు కార్టూన్లని కూడా శ్రద్ధగా సేకరించేవాణ్ణి. అవన్నీ ఈ రోజుదాకా నా దగ్గర భద్రంగా వున్నాయి.

ఆయన కార్టూన్ ఫీచర్ ఆ తరం కుర్ర కారుని, ముఖ్యంగా, కాలేజీ కుర్రాళ్ళని, అమ్మాయిల్ని ఉర్రూతలూగించేది.

నాటి కాలేజీ అమ్మాయిలు చదువుల్రావు క్లాస్ మేటు, గరల్ ఫ్రెండు ఐన- జయశ్రీ స్టయిల్‌ని కాపీ కొడుతూ, పెద్ద బొట్టు, పెద్ద చెవిరింగులతో కాలేజీ రోమియోల్ని ఆకర్షిం చేందుకు ఉవ్విళ్ళూరేవారు.

కుర్రాళ్ళుకూడా చదువుల్రావు హెయిర్ స్టయిల్ ఫాలో అయేందుకు పోటీ పడే వాళ్ళు. అలాగే లెక్చరర్లకి ఆయన సృష్టిం


చిన 'కోడిపలావ్'లాంటి నిక్‌నేమ్స్ తగిలించి అల్లరిపెట్టేవారు.

కుర్రకారులో ఇంత ప్రభంజనం రేపిన ఈ సత్యమూర్తిగారెవర్రా బాబూ అనుకొని విస్తుబోతుండే నాకు, 1965లో నేనొక పని మీద హైదరాబాదు వెళ్ళడం జరిగింది. ఎలాగో కష్టపడి సత్యమూర్తిగారి ఇంటి అడ్రసు తెలుసుకొని, విజయనగర్ కాలనీలో వున్న ఆయన ఇంటికి వెళ్ళాను. తలుపు తెరవగానే ఆయన్ని చూసి, ధమాల్‌మని ఆశ్చర్యం ముంచెత్తగా, నన్ను నేనే నమ్మలేకపోయాను. దానిక్కారణం, నాక్కనబడింది సాక్షాత్తూ సజీవంగా వున్న చదువుల్రావే.

నేన్నింకా ఆశ్చర్యపోయిన విషయమేమంటే, ఆయన చదువుల్రావు కార్టూన్లలో కనబడే హీరోయిన్ జయశ్రీ, సత్యమూర్తిగారి నిజ జీవిత భాగస్వామి జోగీశ్వరిగారు మక్కీకి మక్కీగా ఒకరే కావడం. ఆ రోజు ఆ దంపతులిద్దరూ ఎంతో ఆప్యాయంగా పలకరించిన తీరు నన్ను మైమరిపించింది. సత్యమూర్తిగారు, ఇంట్లోనే వున్న తన స్టూడియోకి తీసుకెళ్ళీ, తను వేసే చదువుల్రావు కార్టూన్ల ఒరిజినల్స్ చూపించి థ్రిల్ చేసారు. జోగీశ్వరిగారేమో వాళ్ళ బాబు భాస్కర్ ( అప్పటికి రెండు మూడేళ్ళ బాబు) ఓ క్రేయాన్ స్టిక్‌తో వాళ్ళ నాన్నగారి బొమ్మ వెయ్యడానికి చేసే ప్రయత్నం గురించి చెప్పి నవ్వించారు.

ఆ రోజు, అలా ఆనందంతో కడుపు నిండిపోయిన నేను, ఇంక వెళ్ళొస్తానంటే, ఆ దంపతులిద్దరూ నన్ను వదలక, ఆప్యాయంగా నాచేత వాళ్ళింటి విందు భోజనం చేయించి మరీ దీవించారు.

అక్కడున్న కాసేపూ సత్యమూర్తిగారు కార్టూన్ల గురించి, వాటిని వేసేందుకు చూపాల్సిన జాగ్రత్తల గురించి, నాకు వివరంగా బోధపరిచారు. భోజనానంతరం




వారి బ్లెస్సింగ్స్‌తో బయటికి వచ్చి, మెట్లు దిగుతుండగా, సత్యమూర్తిగారు "ఒక్క క్షణం ఆగండి!" అంటూ, నన్ను నిలువరించి, లోపల్నుంచి ఓ చిన్న పేకట్ తెచ్చి నా చేతికిచ్చి–"దీన్ని వాడండి! Wish you all the best ! " –అంటూ మరోసారి దీవించారు.

అది స్వామి విభూతి ప్రసాదం అయ్యుంటుందని అనుకుంటూ విప్పి చూసిన నాకు, అందులో ఓ చిన్న ఇండియన్ ఇంక్ పాళీ కనబడింది. అదొక ఇంపోర్టెడ్ నిబ్. ఎక్కువగా తన బొమ్మలన్నీ ఆ బ్రాండ్ నిబ్‌తోనే ఆయన వేస్తుంటారు... నంబర్3 సేబుల్ హెయిర్ బ్రష్షుతోనే శ్రీ బాపూగారు ఎక్కువగా బొమ్మలెసినట్టు. సత్యమూర్తిగారు బహూకరించిన ఆ నిబ్ నాకు ఓ పెద్ద వరంగా పని చేసింది. అంతవరకు బొమ్మలేసేందుకు ఎన్నో ప్రయత్నులు చేసిన నాకు, ఆయనిచ్చిన నిబ్‌తో వెయ్యడం మొదలెట్టాక, బొమ్మలెయ్యడం ఎంతో సుళువనిపించింది.

దాన్ని ఓ మంత్రించిన తాయెత్తులా నేను భద్ర పరుచుకున్నాను.

ఇలా సత్యమూర్తిగారితో ఆనాటి తొలి పరిచయం నాకెన్నో తీపి గుర్తులు మిగిల్చింది.

కార్టూన్ రంగానికి ఆయన అపారమైన సహకారాన్నందించారు. ఆంధ్రభూమి వీక్లీలో కొన్ని సంవత్సరాలబాటు కార్టూన్ చిత్రకళ మీద సత్యమూర్తిగారు అద్భుతమైన రేఖాచిత్ర పాఠాలను ధారావాహికగా అందించారు. ఆ తర్వాత అవి తెలుగు, ఇంగ్లీషు భాషల్లో పుస్తకాలుగా వెలువరించి అతి సరసమైన ధరకే లభింపజేసారు.

తమ కార్టూన్ ప్రావీణ్యాన్ని కేవలం పత్రికా కాలక్షేపానికే పరిమితం చేయక, దానికో ప్రయోజకత్వాన్ని తీసుకొచ్చి, చూపరులను నవ్విస్తూ ఆకట్టుకొనే కార్టూన్ యాడ్లను ఎన్నో ఆయన రూపొందించారు.

మన సత్యమూర్తిగారు కేవలం కార్టూనిస్టు మాత్రమే కాదు. చదువుల్రావుకన్నా ఎంతో చక్కటి అందగాడు. డా.అక్కినేని నాగేశ్వర్రావుగారు నిర్మించిన 'సుడిగుండాలు' చిత్రంలో సత్యమూర్తిగారు ఓ మంచి పాత్రను పోషించారు కూడా.

శ్రీసాయిభగవానుడు సత్యమూర్తిగారి కుటుంబాన్ని, ఆయురారోగ్య, ఐశ్వర్యాలతో పది కాలాలబాటు చల్లగా చూడాలని మన సారా కాంక్షిస్తున్నాను.

వారి దీవెనలు, సహకారం మన కార్టూనిస్టులందరికీ పెద్ద చేయూతగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను **–శంకు.**




# 'చదువుర్రావు' సృష్టికర్త



**ముం**దు ఓ(రెండు వెంట్రుకలు రేగి ఒత్తయిన జుత్తుతో కొంచెం సన్నగా, పొడుగ్గా నీట్‌గా టక్‌చేసుకుని స్టైలిష్ కళ్ళజోడుతో స్మార్ట్‌గా వుండి ఆంధ్రపత్రిక వీక్లీలో వారంవారం దర్శనమిచ్చే 'చదువుర్రావు' అంటే 1963, 64 ప్రాంతాల్లో తెలుగునాట కుర్రకారు అబ్బాయిలకు, అమ్మాయిలకు బోల్డు క్రేజ్!

అలా ఎందరో పాఠకుల్ని అలరించిన ఆ 'చదువుర్రావు' సృష్టికర్త ప్రముఖ కార్టూనిస్టు సత్యమూర్తి గారు! ఆ కార్టూన్ సీరియల్ ఎంత పాప్యులర్ అంటే, ఏదైనా ఫంక్షన్లో సత్యమూర్తి గారు కనిపిస్తే చాలు, అభిమానులంతా ఆయన చుట్టూ మూగేవారు ఆటోగ్రాఫుల కోసం.


నాకు సత్యమూర్తి గారు ఆప్తమిత్రులు. వారిని మొదటిసారి నేను కలుసుకుంది 1969 మార్చిలో. అప్పటికి సుమారు రెండేళ్ళ క్రితమే నేను స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియాలో ఉద్యోగంలో చేరాను. ఈ మధ్యకాలంలో పేరొందిన వివిధ తెలుగు వారపత్రికలలో ఓ పది–పదిహేను కార్టూన్లు అచ్చయిన బుల్లి కార్టూనిస్టుని నేను. మా బ్యాంక్‌లోని నా కవిమిత్రుడు సత్యప్రసాద్ గారికి (సినీ దర్శకుడు వీయెన్ ఆదిత్యగారి నాన్నగారు) సత్యమూర్తి గారితో మంచి పరిచయం ఉంది. ఓ రోజున ఆయన నాతో – "రామకృష్ణ గారూ, సాయంత్రం మీకు వీలుంటే సత్యమూర్తి గారింటికి వెళ్దాము" అన్నారు.


ఆ మాటలు వింటూ ఎగిరిగంతేసినంత పనిచేశాను. అప్పటికే సత్యమూర్తి గారు లబ్ధప్రతిష్ఠుడైన కార్టూనిస్టు! అంత సీనియరు, ఎలా మాట్లాడతారో... ఎన్నో ఆలోచనలతో సాయంత్రం నేనూ, సత్యప్రసాదు విజయనగర్‌కాలనీలోని సత్యమూర్తి గారింటికి వెళ్ళాము. ఆయన వాకిట్లోనే కలిసి సాదరంగా ఆహ్వానించారు. అక్కడ గడిపిన రెండుమూడు గంటల్లో కార్టూన్ల గురించి, పూజ్యులు బాపు గారి అద్భుతశైలి గురించి ఎన్నెన్నో సంగతులు మాట్లాడుకున్నాం! ఎక్కడా నేనో పెద్ద కార్టూనిస్టుని అన్న భావన లేదు, అసలు తన గురించి తాను మాట్లాడిందే తక్కువ! నా కోరికమీద తను వేసిన కొన్ని కార్టూన్లు ఒరిజినల్స్ చూపించి, తను ఎలా వేస్తారో వివరించారు. వెళ్ళబోయేటప్పుడు ఆప్యాయంగా తను వాడుతున్న నిబ్స్ కొన్ని ఇచ్చారు. ఇన్నేళ్ళు గడిచినా ఆనాటి ఆ ఆప్యాయతని ఎప్పటికీ మరువలేను. ఆ తర్వాత ఈ 44 ఏళ్ళలో ఎన్నోసార్లు కలుసుకున్నాం. ఇప్పటికీ అదే ప్రేమ, అదే అభిమానం, అదే మాటతీరు! మంచి స్నేహశీలి, సున్నిత స్వభావులు!


సత్యమూర్తి గారు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి భక్తులు. 'భవాన్స్ జర్నల్'వంటి పెద్ద పత్రికలలో ఎన్నో పురాణగాథలు బొమ్మల కథలుగా వేశారు. తాను స్థాపించిన శ్రీసత్యసాయి డిజైనింగ్ స్టూడియో ద్వారా ఎన్నెన్నో ప్రముఖ సంస్థలకు విస్తృతంగా కళాసేవలనందించారు. కమర్షియల్ ఆర్ట్‌లోనైనా, కార్టూన్ డ్రాయింగ్‌లోనైనా ఆయన వరవడి, శైలి ప్రత్యేకం. వారికి భగవానుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనసారా కోరుకుంటూ...


–కార్టూనిస్టు రామకృష్ణ







మనది సుందరమైన నగరం. ఆ ప్రకృతిసౌందర్యాన్ని చూసి ఆనందించండి.
SATYAMURTY


అలా తిప్పలు పడకపోతే_ నా మాట విని ఒక రిమోట్ కంట్రోల్ ఉండే టివిని కొనండి


మీరు చీరల షాపులకి, నగల షాపులకి వెళ్ళడానికి వీల్లేదని కట్టడి చేసారుగా. అందుకే ఫోన్ చేసి తెప్పించుకుంటున్నాను
SATYAMURTY



డాక్టరుగారు పొద్దున్న రౌండ్స్‌కి వచ్చినప్పుడు నన్ను చూసి 'రేపు ఉదయం నీకు ఆపరేషన్ చేసేస్తాం, రెడీగా ఉండు సుబ్బారావ్' అని అన్నారు, కానీ నా పేరు నరసింహం. నాకేదో భయంగా ఉంది సిస్టర్.
నేను హత్యానించి తప్పించుకోడానికి హాస్పిటల్లో చేరానంతే


'వెయిట్ లిఫ్టింగ్ చేసి బంగారు పతకాలు సాధించడం ఎలా?' అని నాలుగు వారాలు వచ్చేలా రాసేనండి. తరువాత హెర్నియా, దాని జాగ్రత్తలు, చికిత్సా విధానం_ అని వంద వారాలు వ్రాసి పాఠకుల్ని పత్రికకే కట్టి పడేయొచ్చండి
ఎడిటర్


మీకు ముందుగా చెప్పడం ధర్మం అనుకుంటున్నాను. మీ ఆవిడ రెండు మూడు రోజుల్లో లేచి తిరగగలుగుతుంది
SATYAMURTY



# హాస్య, వ్యంగ్య చిత్రాల నిత్యకీర్తి - శ్రీ సత్యమూర్తి




- వి.వి.సత్యప్రసాద్, కవి

"**భా**వరాజు వేంకట సత్యమూర్తి గారంటే ఎవరూ?" అని అడిగితే 'ఏమో తెలియదు' అంటారేమో గాని చదువులరావ్ సత్యమూర్తి గారంటే ఎవరు? అని అడిగితే "ఆయన హైదరాబాద్‌లో రెడ్‌హిల్స్‌లో ఉంటారు. సత్యసాయి డిజైనింగ్ స్టూడియోస్ అధినేత, ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ సత్యమూర్తి" అంటూ ఠక్కున జవాబు చెప్పేస్తారు పత్రికలు చదివే అలవాటున్న ఏ పాఠకుడైనా, హాస్యప్రియు డైనా, అభిమాని అయినా సత్యమూర్తిగారంటే తెలియని వారు లేరు.

సత్యమూర్తిగారు 19వ దశకంలో ప్రతి కాలేజీ కుర్రాడికీ ఓ 'రోల్ మోడల్'! అప్పటి ఆంధ్రపత్రికలో 'చదువులరావ్' పేజీ కోసం తహతహలాడని స్టూడెంట్ లేడు!

ఆంధ్రప్రదేశ్ నాలుగు చెరుగులా ఆనాటి యువతని అంతగా ఉర్రూతలూగించిన 'సత్య మూర్తి'ని పరిచయం చేసుకోవాలని, తముకు తట్టిన జోక్స్ ఆయనకు వినిపించాలని ఆయన గురించి వాకాబు చేసేవారు. అటువంటి వారి లో నేనూ ఒకడిని. మా అదృష్టమేమిటంటే- ఆయన నాన్నగారు ప్రముఖ ఇంజనీర్. తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో ఉండే వారు. మా నాన్నగారు కూడా రామచంద్రా పురంలోనే బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. నేను రాజమండ్రి ఆర్ట్స్ కాలేజి స్టూడెంట్‌గా ఉంటూ శెలవలకి రామచంద్రాపురం వచ్చే వాడిని. శ్రీసత్యమూర్తిగారు కూడా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక రామచంద్రాపురం లో తండ్రిగారు దగ్గర కొన్నాళ్ళు ఉన్నారు.

ఆ సమయంలోనే రామచంద్రాపురంలో ఆయనతో నాకు పరిచయం ఏర్పడింది.

ఆయన అప్పటికే గొప్పపేరు ప్రఖ్యాతులు పొందిన చిత్రకారుడు. పరిచయం చేసుకోవ డానికి నేను ఏ విధంగా తగిన వాణ్ణి కాను అని కొంచెం సంకోచం, బిడియం, భయం ఉండేవి. అయితే ఆయనతో మాట్లాడిన రెండు నిమిషాల్లోనే అన్నీ పటా పంచలైపోయాయి. నిరాడంబరుడు, నిగర్వి, స్వచ్ఛమైన పాల వెన్నెలలాంటి నవ్వు, జోక్స్ మీద జోక్స్ ఎంతగా ఆకర్షితులమయ్యామంటే ఆయన వూళ్లో లేని రోజుల్లో ఏదో వెలితిగా ఉండేది.


ప్రతిరోజు శివాలయం ఎదురుగా ఉన్న చెరువు గట్టు మీద సాయంత్రం పూట కలుసు కునే వాళ్ళం. సత్యమూర్తిగారు అక్కడికి వస్తు న్నారంటే ఎందరో స్నేహితులు గుమిగూడే వారు. ముఖ్యంగా ప్రముఖ కవి ఇంద్రగంటి హనుమశ్శాస్త్రి గారి అబ్బాయి ఇంద్రగంటి శ్రీభానుమూర్తి, శ్రీ శ్రీకాంత్ శర్మ, సత్తిరాజు సుందర శివరావు, పున్నమరాజు హరనాథ్, శేషగిరిరావు (AIR ప్రముఖ గాయనీమణి పున్నమరాజు గీత గార్ల సోదరులు), ఇంద్ర గంటి హనుమంతరావు, విఘ్నేశ్వరరావు, శిరిగినీడి సూర్యనారాయణ అందరూ చుట్టూ చేరేవారు.

శ్రీకృష్ణుడు యమునా నదీ తీరంలో గోపిక లని ఆకర్షించినట్టుగా శ్రీసత్యమూర్తిగారు మమ్మల్ని అలా ఆకర్షించేవారు. అలనాటి శ్రీ కృష్ణుడు వేణువునూదితే శ్రీసత్యమూర్తిగారు 'మౌత్ ఆర్గాన్' వాయిస్తూ మమ్మల్ని మంత్ర ముగ్ధుల్ని చేసేవారు. తర్వాత ఛలోక్తులు, అప్పటి పత్రికలలో వచ్చిన కథలు, కార్టూన్లు, కవితలు, సీరియల్స్ వీటన్నిటిపై చర్చలు, విశే షాలు మాట్లాడుకుని ఎవరిళ్ళకి వారు చేరు కొనే వారు. నిజమైన సత్సాంగత్యం, సజ్జన సాంగత్యం - ఆనాడు మేము ఈయనతో చవి చూశాము.

ఆయనలో వున్న మరో గొప్పతనం- స్నేహి తులలో ఎవరిలో ఏ 'టేలెంట్' వున్నా మనస్ఫూ ర్తిగా ఎంకరేజ్ చేయడం.

ఆయన వేసే కార్టూన్స్‌లో హుందాతనం కనిపిస్తుంది. సునిశితమైన హాస్యమే ఉంటుం ది కానీ ఎబ్బెట్టుగా వుండదు.

కాలచక్రం ఆయనపై ఏ ప్రభావమూ చూప లేదు. కారణం - ఆయన మనస్సు ఎప్పుడూ నిత్య దరహాసంతో శోభిల్లుతూ స్వచ్ఛంగా నిర్మలంగా ఉంటుంది. ఆయన అభిమానులు కొన్ని ముఖ్య పట్టణాల్లో సత్యమూర్తిగారు వేసిన చిత్రాలను, కార్టూన్లను ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ఆయనను ఘనంగా సత్కరిం చారు. వారి అభిమానాన్ని చాటుకున్నారు.




ఇది విన్నారా?! పొద్దున్న ఒక జ్యోతిష్కుడి దగ్గరకెళ్ళాను. అతను నా చెయ్యి చూసి 'మీది అమృతహస్తం, మీరు చాలా అదృష్టవంతులు.
మీరు అనుకోకుండా ఆశ్చర్యం కలిగించే అదృష్టం మిమ్మల్ని వరిస్తుంది' అని అన్నాడు
అవన్నీ నమ్మకే...
నమ్మాలండీ
వాడు చెప్పిందంతా బూటకం అని నా అనుమానం
భలేవారే. అతను చెప్పినదంతా నిజమయిందండి
ఇందాక నేను ఇంటికి వస్తూ వర్షం వస్తుంటే దారిలో ఉన్న ఓ నగల షాపులో ఆగేను. అక్కడ అనుకోకుండా 40వేలకి ఓ నెక్లెస్‌ని చూసి మనసుపడి కొన్నాను
అంత డబ్బు ఎక్కడిదే?
పొద్దున్న మీరు క్రెడిట్ కార్డుని బల్ల మీద పెట్టి మరిచిపోయారు. వెళ్తూ వెళ్తూ జాగ్రత్త చేద్దామని నా హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకెళ్ళాను కదా

## నవ్వుల 'సత్య'హరిశ్చంద్రుడు

'**స**త్య'హరిశ్చంద్రుడు 'మూర్తీ'భవించిన ఆ మరో రూపమే సత్యమూర్తి. కార్టూనిస్ట్‌గా ఆయన ఎంత గొప్పవారో మనిషిగా అంతకు మించిన గొప్పవారు. తరతమ భేదాలు లేకుండా ఎవరినైనా మన స్ఫూర్తిగా గౌరవించగలిగిన శక్తి ఆయనకుంది. వయసు మీద పడుతున్నా ఆరోగ్యం సరిగా లేకున్నా ఆయన కార్టూన్స్ గీయడం ఎప్పుడూ ఆపలేదు. ఆంధ్రభూమిలో ప్రతివారం పలకరిస్తూనే ఉంటారు. "కార్టూన్‌లు గీయడమెలా?" అనే పుస్తకం తెచ్చి భారతీయులెందరినో కార్టూనిస్టులుగా తీర్చిదిద్దారు.

భాగ్యనగరం వెళితే ముందెప్పుడూ ఆయనే గుర్తొస్తారు. ఆయనిచ్చిన ఆతిథ్యం నాకు లభించిన ఆతిథ్యాలలోకెల్లా ప్రత్యేకమైనది, చిరస్మరణీయమైనది. ఆయనిచ్చిన పాళీలను పదిలంగా దాచుకున్నాను కూడా. గొప్పవారని భావించే కార్టూనిస్టులు ఆయన నుండి చాలా నేర్చుకోవాలి.

హాస్యానందం 'రాము'గారు సత్యమూర్తిగారి ప్రత్యేక అభినందన సంచిక తీసుకురావడం ఆనందదాయకం! ఒక్కొక్కరిగా కార్టూనిస్టులను హాస్యానందం ఆదరిస్తున్న తీరు అభినందనీయం!



ప్రతీఏటా మా నాన్నగారి పేరున ఇస్తున్న 'మళ్ళా జగన్నాథం స్మారక భువన్ బెస్ట్ కార్టూనిస్ట్ అవార్డు-2012'ను విశాఖపట్నం స్వయంగా వచ్చి స్వీకరించి ఆ అవార్డుకే వన్నెలందించిన శ్రీ సత్యమూర్తిగార్కి భువన్ ఎల్లప్పుడూ కృతజ్ఞుడు.

**-భువన్,** కథారచయిత, వ్యంగ్యచిత్రకారుడు.

## వారిది ఒక విలక్షణమైన శైలి.

**శ్రీ**సత్యమూర్తిగారు సహృదయులు.

కళతోపాటు సహృదయం కలిగి ఉండటం బంగారానికి తావి అబ్బడం వంటిది. ఒక సీనియర్ కార్టూనిస్ట్‌గా ఆంధ్రపాఠకులకు సపరిచితులైన శ్రీ సత్యమూర్తిగారు ఆ రోజుల్లో వారి కార్టూన్లతో ఒక ప్రభంజనమే సృష్టించారు. వారిది ఒక విలక్షణమైన శైలి. అది వేరే ఎవరూ కాపీ చేయలేనిది.


కార్టూన్ చూడగానే ఇది సత్యమూర్తిగారిది అని స్పష్టంగా తెలిసిపోతుంది. వారి కార్టూన్లు కేవలం పత్రికలకే పరిమితం కాలేదు. సిమెంట్, ఎరువుల కంపెనీలవంటి ఎంతో మంది వీరి కార్టూన్లను వాణిజ్యపరంగా వాడుకున్నారు.

సత్యమూర్తిగారు సాయి భక్తులు సత్యసాయి జీవిత చరిత్రను బొమ్మలతో కొన్ని సంపుటాలుగా వెలు వరించారు. మన కార్టూనిస్టులం అందరం గర్వంగా చెప్పుకోదగ్గ సత్యమూర్తిగారు ఆయురారోగ్యాలతో ఉంటూ మరిన్ని కార్టూన్లు వేయాలని కోరుకుంటున్నాను.




నా రెండవ పుస్తకావిష్కరణ సభలో వారిని సన్మానించుకునే భాగ్యం నాకు కలిగింది. సర్వశ్రీ చంద్ర, బాలి గీతాసుబ్బారావు,రాంపా, కేబీలక్ష్మి, తమ్మా సత్యనారాయణగార్ల సమక్షంలో వారికి సన్మానం జరిగింది.


**-సరసి, కార్టూనిస్ట్.**




## శ్రీ సత్యమూర్తిని కలిసే భాగ్యం కలిగింది.

**హా**స్యానందం ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ సత్యమూర్తిగారి ప్రత్యేక సంచిక వేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

2012 అక్టోబర్ 28 నుండి 30 వరకు సమైక్యభారతి ఆధ్వర్యంలో పబ్లిక్‌గార్డెన్ హైదరాబాద్‌లో జరిగిన తెలుగు కార్టూనిస్ట్‌ల సమావేశంలో శ్రీ సత్యమూర్తిని కలిసే భాగ్యం కలిగింది. వారితో గడిపిన కాసేపట్లోనే చాలా మెళకువలు, సూచనలు, ఆశీర్వాదాలు అందించారు. వారిలాంటి ఒక లెజండరీ కార్టూనిస్ట్ నాబోటి ఓ శిష్య పరమాణువుకు ఎంతో అభిమానంగా ఓ లేఖ ద్వారా వారితో దిగిన ఫొటోను జతపరుస్తూ ఆశీఃపూర్వకంగా అభినందిస్తూ రాసిన మధురస్మృతి మీతో పంచుకునే అవకాశం ఇచ్చిన హాస్యానందం రాముగారికి కృతజ్ఞతలు. **-చక్రవర్తి, కార్టూనిస్ట్**


MyDear Chakravarty garu


నమస్కారములు.


కార్టూన్ ఉత్సవంలో మిమ్మల్ని కలవడం నాకు సంతోషం కలిగించింది. మీరు నాకు ఎంతో సాయం చేసేరు. మీరున్న ఫోటోని పంపుతున్నాను. పత్రికల్లో మీ కార్టూన్స్ చూస్తున్నా. బాగుంటాయి. భూమిలో మీ బొమ్మల కథ బాగుంది. మిమ్మల్ని అభినందించాలనే ఈ ఉత్తరం రాస్తున్నాను. ఎప్పుడైనా టైమ్ దొరికినప్పుడు ఉత్తరం రాయండి.


ఇట్లు

సత్యమూర్తి


18.1.2013






ఇప్పుడర్థమయిందండి, మనకే డబ్బు ఎందుకు సరిపోటంలేదో!!!
... నేను ఖర్చుపెడ్తున్నంత స్పీడుగా మీరు సంపాదించలేకపోతున్నారు


గొంతుక పోయినా, అరవలేక, నన్ను ఇలాకూడా సాధిస్తున్నావన్నమాట


... మీ కథలు తిరిగి వాపస్ వచ్చేస్తే నేనేం చెయ్యనండీ బాబూ ఇది చాలా అన్యాయం సార్


... నాన్నగారు కావాలా?...
... కొంచెంసేపయ్యాక చెయ్యండి...
ఇప్పుడే కొంచెం స్క్రూలూజ్ అయ్యింది.


కొంచెం లేటయిందిప్పుల్లారావ్. త్వరగా వచ్చేస్తే, అంతసేపు నీతో గడపడం చాలా బోరు కొట్టేస్తుంది కదా?


ఉండు మోహన్... జాగ్రత్త... మా నాన్న రహస్యంగా గోడకి వీడియో కెమెరాని, ఈ సోఫా కింద టేప్ రికార్డర్‌ని పెట్టేడు.




హాస్యానందం పై
అభిమానంతో
శ్రీ సత్యమూర్తిగారు
తయారు చేసి ఇచ్చిన
యాడ్